క్లుప్తంగా

కవి సామ్రాట్‌కు ఘన నివాళి



విశ్వనాథ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ట్రస్టు సభ్యులు

కాకినాడ రూరల్: కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి రమణయ్యపేటలో శుక్రవారం ఘన నివాళి అర్పించారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వనాథ సత్యనారాయణ చిత్ర పటానికి అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, సూర్య, రాజా తదితరులు నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకున్న ఘనత విశ్వనాథ సత్యనారాయణకు దక్కుతుందని వారు పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాత వరలక్ష్మి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో వృద్ధులకు నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పరులకు చేతనైన సహాయం చేయాలనే తపనతో తన వంతుగా దుప్పట్లు పంపిణీ చేశానన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, రాజా తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్:	విశ్వం, వేట్టయన్, ఇద్దరు, జనక అయితే గనక
దేవి మల్టీప్లెక్స్:	ది డెవిల్, విశ్వం, దేవర, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మీ:	కల్లు కాంపౌండ్
సత్యగౌరి:	లవ్ రెడ్డి
తిరుమల:	ఖడ్గం
సీఅండ్‌సీ:	జనక అయితే గనక
సీఅండ్‌సీ 2:	శ్వాగ్
పద్మప్రియ:	దేవర
శ్రీప్రియ:	మార్టిన్
సూర్య 1:	దేవర
సూర్య 2:	జనక అయితే గనక

రూ.10 నోట్ల కొరత..!

- మార్కెట్‌లో తగ్గిన చలామణి
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- ఆన్‌లైన్ చెల్లింపులు అధికం



పది రూపాయల నోట్లు

కాకినాడ సిటీ: మార్కెట్‌లో రోజు రోజుకూ రూ.10 నోట్ల కొరత ఏర్పడుతోంది. వీటి చలామణి తగ్గడంతో వ్యాపారస్తులు, కొనుగోలు దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా మార్కెట్లోకి కొత్త నోట్లు రాకపోవడంతో చిరిగిపోయిన నోట్లే దర్శనమిస్తున్నాయి.

వ్యాపారులకు చిల్లర కష్టాలు

రూ.10 నోట్లు రాకపోవడంతో గిరాకీలు తగ్గిపోతున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. కిరాణా దుకాణాలు, హోటళ్లు, పెట్రోలు బంక్‌లు, ఫ్యాన్సీ, పిల్లల ఆట వస్తువుల దుకాణాలు, కూరగాయలతో పాటు పలువురు దుకాణాదారులు ప్రతి రోజూ చిల్లర కోసం కొనుగోలుదారులతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. దుకాణంలో రూ.100లు ఇస్తే తిరిగి కొనుగోలు దారుడికి చిల్లర ఇవ్వాల్సి వస్తే రూ.10 నోట్లు ఉండటం లేదు. గతంలో నాణేల కొరత ఉన్న సమయంలో చిల్లరకు బదులుగా చాక్లెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10కి బదులు ఏమి ఇవ్వాలో తెలియడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా కొత్త నోట్లు రాకపోవడంతో చిరిగిన నోట్లు కనిపిస్తున్నాయి. పలు సందర్భాల్లో చిరిగిన నోట్లు తీసుకోవడం లేదని వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

రూ.10 నోట్లు తగ్గిపోవడంతో ఆన్‌లైన్ చెల్లింపులు అధికమవుతున్నాయి. కరోనా సమయం నుంచి ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకు ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ మొదలు చిన్న దుకాణాల వరకు ఆన్‌లైన్ చెల్లింపులు కొనసాగుతున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంతో పాటు వివిధ రకాల యాప్‌లతో సులభతరంగా చెల్లింపులు చేసేందుకు బ్యాంక్ అకౌంట్‌కి సంబంధించిన క్యూఆర్ స్కానర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. అందరూ ఆన్‌లైన్ పే చేయడంతో నోట్లు రావడం లేదు.



పూజా సామాగ్రి దుకాణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ స్కానర్

ఇబ్బందులు పడుతున్నాం



రూ.10 నోట్లు దొరక్కపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొన్నేళ్లుగా కొత్త నోట్లు రావడం లేదు. చిరిగిన నోట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల వద్ద వస్తువులు కొన్నప్పుడు రూ.10 చిల్లర ఇవ్వాల్సి వస్తే చిరిగిపోయిన నోట్లు ఇస్తున్నారు. అవి వేరే చోట మారకం జరగడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక తప్పక రూ.10లు కూడా ఆన్‌లైన్ పేమెంట్స్ చేస్తున్నాం.

– బొమ్మిడి కిరణ్‌బాబు, సాంబమూర్తినగర్, కాకినాడ.

ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు



కొంత కాలంగా రూ.10 నోట్లు దొరకడం లేదు. మంచినీరు తీసుకెళ్లే ప్లాంట్లు, చిల్లర దుకాణాల వద్ద వీటి అవసరం ఎక్కువగా ఉంది. మంచినీరు టిన్నుకు రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉంది. పెద్ద నోట్లు తెస్తే చిల్లర దొరకని పరిస్థితి. రూ.10 నోటు ఇవ్వాల్సివస్తే వాటిని వెతకాల్సిన పరిస్థితి. పాత నోట్లు చిరిగిపోయి ఉండడంతో వాటిని వినియోగదారులు తీసుకోవడం లేదు. ఇక ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు.

– కక్కల శ్రీదుర్గ, తూరంగి, కాకినాడ.

మద్యం తాగి బైక్ నడిపితే జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నలుగురికి రెండు రోజులు చొప్పున జైలు, ముగ్గురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం పట్టుబడ్డవారిని కోర్టులో హాజరుపరచగా, నలుగురికి ఒక్కొక్కరికి రెండు రోజులు జైలు, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మూడు గ్రామాల్లో 'పల్లె పండుగ'

కాకినాడ రూరల్: 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇంద్రపాలెం, చీడిగ, గంగనాపల్లి గ్రామాలలో సుమారు రూ.2.10 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస బాబా, పితాని అప్పన్న తదితరులు పాల్గొన్నారు. ఆగష్టు నెలలో గ్రామ సభల్లో అభివృద్ధి పనులకు చేసిన తీర్మానాల మేరకే రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు.

వినతులపై సానుకూల దృక్పథం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్ భావనతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దరఖాస్తులపై ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. ఇందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

గ్రౌండింగ్ వేగవంతం చేయండి

హౌసింగ్, జాతీయ ఉపాధి హామీ పథకం పనులు గ్రౌండింగ్, మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, నాణ్యత తనిఖీ, పీఎం సూర్యఘర్ వంటి అంశాలపై ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు గ్రౌండింగ్ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈనెల చివరి నాటికి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజనపై మండల స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. బరియల్ గ్రౌండ్, డంపింగ్ యార్డ్, పారిశ్రామికీకరణకు అవరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. మండల స్థాయి అధికారులు రెవెన్యూ అంశాలపై ప్రత్యేద దృష్టి పెట్టి ప్రగతి కనపరచాలన్నారు. వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశపు మందిరంలో అడల్ట్ (వయోజన) ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ ఉల్లాస్ పథకంపై జరిగిన జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దేశంలో 100 శాతం అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గుర్తించిన నిరక్షరాస్యులకు వచ్చే నెల 5వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య వంటి అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సమాజానికి అవసరమైన సేవా కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టామని రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత సేవా ప్రాజెక్టులను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రాంకోసాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రోటరీ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో మదర్ మిల్క్ బ్యాంక్, బాలికా విద్య, ఉపాధి అవకాశాలపై శిక్షణతో పాటు పోలియో నిర్మూలన వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 'మన అభివృద్ధి..దేశాభివృద్ధి' అనే నినాదంతో డిస్ట్రిక్ట్ పరిధిలో ఉన్న 86 రోటరీ క్లబ్బులు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించే విధంగా పలు ప్రాజెక్టులను రూపొందించామన్నారు. ఇప్పటి వరకూ పోలియో నిర్మూలనకు రోటరీ రూ. 4 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. స్థానిక అచ్చంపేట జంక్షన్‌లో రోటరీ గవర్నర్‌కు రోటరీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. తొలుత క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న మినరల్ వాటర్ పథకంతో పాటు రోటరీ వృద్ధాశ్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ ధనసాగర్ ప్రసాద్, రోటరీ మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్, కార్యదర్శి డి శ్రీకాంత్, సభ్యులు చార్మినార్ వర్మ, టివి బాలకృష్ణ, నెక్కంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం



స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వీసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, ఇన్‌చార్జ్ వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నివేదిక, చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ యూనివర్సిటీ తరపున 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశంలో 2024–25 విద్యా సంవత్సారానికి సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి తగు చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్పోర్ట్స్‌కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, డీఏపీ బాలకృష్ణ, ప్రైవేటు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇక ఊరూరా బెల్టు షాపులు



కాకినాడ సిటీ: మద్యం దుకాణాలన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. మద్య నియంత్రణలో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు దుకాణాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచుకుని మద్యం సరఫరా చేయగా, కూటమి ప్రభుత్వం పాత మద్యం పాలసీని రద్దు చేసి దుకాణాల సంఖ్య పెంచి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. ఇప్పటికే లాటరీ విధానంలో షాపులు దక్కించుకున్న ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు ప్రారంభించారు. ప్రభుత్వం రాత్రి 10 గంటల వరకే అనుమతి అని చెబుతున్నా, దుకాణాలన్నీ టీడీపీ నేతలే దక్కించుకున్న నేపథ్యంలో అర్ధరాత్రి వరకూ అమ్మకాలు సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకురావడంతో కాకినాడ, కాకినాడ రూరల్ నియోజకవర్గాల్లో దాదాపుగా 65 షాపులను లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులు దక్కించుకున్నారు. గతంలో ఉన్న నిబంధనలు తొలగించిన నేపథ్యంలో మద్యం షాపు ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చంటున్నారు.

జనాభా ఆధారంగా గ్రామాల్లో బెల్టు దుకాణాలు

లాటరీలో మద్యం దుకాణాలు పొందిన వారంతా అమ్మకాలు పెంచుకునేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడెక్కడ బెల్టుషాపులు తెరవాలనే పనిలో ఉన్నారు. కొందరు ఇప్పటికే ఆయా గ్రామాలను గుర్తించి అక్కడ తమ అనుచరుల ద్వారా మద్యం విక్రయాలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెబుతున్నారు. గ్రామ జనాభాను బట్టి రెండు నుంచి ఆరు దాకా బెల్టు షాపులు, పట్టణ పరిధిలో మరిన్ని పెంచేందుకు పావులు కదుపుతున్నారు. ఇలా చేస్తే కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో సుమారు 100 నుంచి 130 వరకు బెల్టు షాపులు రావొచ్చని అంచనా. కొన్ని చోట్ల ఇప్పటికే బెల్టు షాపులు నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలోని ఈపీడీసీఎల్ డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ట్రూ అప్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకించాలని ఆందోళనకారులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో రూ. 8,114 కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందని విమర్శించారు. కరెంటు బిల్లులే కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు.. ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు చార్జీలు కంటే కొసరు ఛార్జీలు ఎక్కువయ్యాయని విమర్శించారు. గతంలో వాడుకున్న కరెంటుకు కూడా ఛార్జీలు చెల్లించాలని అంటున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు ప్రతి ఇంటికి, దుకాణానికి స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని, అదాని కంపెనీకి కాంట్రాక్ట్ ఇస్తున్నారని ఆందోళనకారులు వివరించారు. ఈ స్మార్ట్ మీటర్లతో అదాని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే ప్రయోజనమని, ప్రజలకు నష్టం, భారం అవుతుందన్నారు. దీనిని ఆదిలోనే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈపీడీసీఎల్ డీఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ, కెఎస్ శ్రీనివాస్, పలివెల వీరబాబు, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిహెచ్ రమణి, మలకా రమణ, కె వీరబాబు, సింహాచలం, టి రాజా, వి రాజబాబు, సత్తిరాజు, సురేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఏఎస్‌డీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

బాలాజీచెరువు: ఏఎస్‌డీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ఎన్.మూర్తిరాజు శుక్రవారం తెలిపారు. అండర్–19 విభాగంలో ఎన్.కల్యాణి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అండర్ –17 విభాగంలో పి.సునంద తేజశ్విని, వై.జ్యోతి చంద్రిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయారన్నారు. అండర్–17 హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో ఏ.త్రిపుర సుందరి, వి.మాధవి, డి.మల్లేశ్వరి, పి.యుగశ్రీలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చూపారన్నారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.03
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10



వాకలపూడి చేపల మార్కెట్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



వాకలపూడి పార్కు ఎదురుగా రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గొయ్యి

రహదారులు జలమయం.. ప్రయాణం నరకం

కాకినాడ రూరల్: కొద్దిపాటి వర్షాలకే నీరు పోయే మార్గాలు లేక వాకలపూడి గ్రామంలో పలు చోట్ల రోడ్లు మురుగు కూపాల్లా దర్శనమిస్తున్నాయి. గ్రామంలో గంగాలమ్మ గుడి సమీపంలో చేపల మార్కెట్ దాదాపు నెల రోజులుగా నీటిలో ఉంది. ఇక్కడ చాలా మంది మహిళలు చేపల విక్రయాల ద్వారా జీవనోపాధి పొందేవారు. వర్షాలకు నీరు చేరడంతో పోయే మార్గం లేక దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మార్గంలో వెళ్లేవారితో పాటు సమీపంలోనే ఉన్న అపార్టుమెంట్ వాసులు దుర్గంధాన్ని భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. కొద్ది దూరంలోని హైస్కూల్ పక్కన ఇటీవల అభివృద్ధి చేసిన చెరువు, పార్కు ఎదురుగా రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షాలకు నీరు నిలిచి పోవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే గొయ్యి పూడ్చడంతో పాటు చేపల మార్కెట్ వద్ద నీరు పోయే మార్గం చేయాలని స్థానికులు కోరుతున్నారు.